పేరుకే క్రీడా ప్రాంగణాలు

గ్రామాల్లోని యువత, విద్యార్థులకు ఆరోగ్యమైన జీవితం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. లక్ష్యం బాగానే ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో వాటి నిర్వహణ ఆయా గ్రామాల్లో అధ్వానంగా మారింది.

- లక్షల్లో ప్రభుత్వం ధనం వృథా
- నిర్వహణ లేక అధ్వానంగా మైదానాలు



ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం బోర్డు

జహీరాబాద్ టౌన్: గ్రామీణ ప్రాంతాల యువతను క్రీడల్లో ప్రోత్సహించాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం ఆయా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. ఆర్భాటం చేయడమే తప్పా సౌకర్యాలను విస్మరించారు. దీంతో క్రీడా ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితమయ్యాయి. చాలావరకు గ్రామాలకు దూరంగా ఉండటంతో పాటుగా క్రీడా పరికరాలు సరిగ్గా లేకపోవటంతో క్రీడాకారులు ప్రాక్టీస్ చేయలేకపోతున్నారు. వాటి నిర్వహణ అధ్వానంగా మారింది.గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు రూ. 70 వేల నుంచి రూ. 2 లక్షల వరకు వెచ్చించి, ప్రతి గ్రామ పంచాయతీతో నిర్మించింది. క్రీడా పరికరాలను కూడా పంపిణీ చేసింది. క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలు దాటుతున్నా అధిక శాతం వినియోగంలో లేవు. జహీరాబాద్ నియోజకవర్గంలోని జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, కోహీర్ మండలాలతో పాటు జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో సుమారు 200 వరకు ప్రాంగణాలను పూర్తి చేశారు. వీటి కోసం రూ.1.40 కోట్లకు పైగా ఖర్చు చేశారు.

అన్నీ చోట్ల నిరుపయోగం

నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, ఖాళీస్థలాలు, పల్లె ప్రకృతి వనాల్లో క్రీడా ప్రాంగణాల బోర్డులు ఏర్పాటు చేశారు. పర్యవేక్షణ లేక ప్రస్తుతం అవి నిరుపయోగంగా మారాయి. కొన్ని క్రీడాప్రాంగణాలు గ్రామానికి దూరంగా ఏర్పాటు చేయడం వల్ల అటు వైపు యువత కన్నెత్తి కూడా చూడడం లేదు. దీంతో క్రీడ మైదానాల్లో పిచ్చిమొక్కలు మొలిశాయి. మండలాలు, మున్సిపాలిటీల వారీగా కిట్లను కూడా పంపిణీ చేయగా అవి అటకెక్కాయి. అధికారులు అదరబాదరగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేతులు దులుపుకొన్నారని యువత వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి క్రీడా ప్రాంగణాలను వినియోగంలోకి తీసుకురావాలని యువత కోరుతున్నారు.

పంచాయతీలదే బాధ్యత

క్రీడా ప్రాంగణాల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వాటిని గ్రామ పంచాయతీలు చూసుకోవాలి. చాలా వరకు వినియోగంలో ఉన్నాయి. కొన్ని చోట్ల పర్యవేక్షణ కరువైంది.

– అశోక్‌కుమార్, ఏపీఓ, జహీరాబాద్

హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం

- ప్రహరీకి వెంటనే గేటు ఏర్పాటు చేయాలని కార్యదర్శికి ఆదేశం



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

హత్నూర(సంగారెడ్డి): మండలంలోని దౌల్తాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం ఉండడంతో పాటు గేటు లేకపోవడంతో పాఠశాల హెచ్‌ఎంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే, విద్యార్థుల కోసం తెచ్చిన భోజనాన్ని పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, భోజనం ఇంత తక్కువగా ఉందని, హెచ్‌ఎంను కలెక్టర్ అడగ్గా హెచ్‌ఎం తడబడటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తరగతి గదిలోకి వెళ్లి చదువు ఎలా బోధిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. వెంటనే పాఠశాలకు గేటు ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ఆమె వెంట ఆర్డీఓ రాజు, తహసీల్దార్ పర్వీన్ షేక్, తదితరులు ఉన్నారు.

అనుమతిలేని క్లినిక్‌ల సీజ్



క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ సోహెల్

రాయికోడ్(అందోల్): రాయికోడ్, చిమ్నాపూర్, సిరూర్, సింగితం, కర్చల్, హస్నాబాద్ గ్రామాల్లోని పలు ప్రైవేటు ఆస్పత్రుల, క్లినిక్‌లు, ల్యాబ్‌లను డాక్టర్ సోహెల్ గురువారం తనిఖీ చేసి వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా పలువురు క్లినిక్‌లు నడుపుతున్నట్లు తనిఖీల్లో గుర్తించామన్నారు. రాయికోడ్‌లోని ఓ ఆస్పత్రి, చిమ్నాపూర్‌లో 3 క్లినిక్‌లు, ఒక ల్యాబ్, సింగితంలో ఒక క్లినిక్‌ను సీజ్ చేశామన్నారు. కనీస విద్యార్హత, గుర్తింపు కార్డులు లేకుండానే క్లినిక్‌లను నిర్వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్స్‌లను రోగులకు ఇస్తున్నారన్నారు. నిబంధనలను ఉల్లంఘించి రోగులకు మందులు ఇస్తూ సెలెన్‌లను పెడుతున్నారని చెప్పారు. స్టెరాయిడ్‌లతో రోగం తక్షణం తగ్గిన దీర్ఘకాలంలో శరీరంలోని వివిధ అవయవాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. సెలెన్‌లు ఎక్కించడం, యాంటిబయాటిక్స్ మందులు ఇవ్వడానికి క్లినిక్ నిర్వాహకులకు అనుమతి లేదన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే మెరుగైన వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాయికోడ్ పీహెచ్‌సీ కేంద్రం సిబ్బంది యాదవరావు, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

- డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి



మెడిసిన్ గదిని పరిశీలిస్తున్న సంగారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రోగులకు నాణ్యమైన ఆహారం అందించాలని డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, ఆహారాన్ని పరిశీలించారు. రోగులకు అందించే ఆహారంలో గుడ్డుతో పాటు అరటిపండును అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రి రిజిస్టర్‌ని పరిశీలించి, రోజు వారి స్కానింగ్‌ల వివరాలను తెలుసుకున్నారు. అలాగే, ఆపరేషన్ థియేటర్‌ను సెకండ్ ఫ్లోర్ నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు షిఫ్ట్ చేయాలని సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డికి సూచించారు. డయాలసిస్ యూనిట్ ఏర్పాటుకు రూమ్‌లను పరిశీలించారు. కేంద్ర అవార్డు వచ్చిన నేపథ్యంలో సిబ్బందిని అభినందించారు. ఆర్‌ఎం ప్రవీణ, వైద్యులు ఉన్నారు.

మందుబాబులకు జరిమానా

సంగారెడ్డి క్రైమ్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లాకోర్టు జరిమానా విధించింది. బుధవారం అర్ధరాత్రి సంగారెడ్డిటౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐ సుమన్‌కుమార్ ఆధ్వర్యంలో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అందులో ఐదుమంది వాహనదారులు మద్యం సేవించి పట్టుపడ్డారు. వారిని సంగారెడ్డి కోర్టులో హాజరు పరచగా జిల్లా జడ్జి ఒక్కోక్కరికి రూ.2000 చొప్పున జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో యునైటెడ్ నేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెఎస్ఎస్ రత్న ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్ నేరాలు, విజిలెన్స్‌పై అవగాహన కల్పించారు. యువత సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని, ఫోన్‌కు వచ్చే అపరిచితమైన లింకులను ఎట్టి పరిస్థితిలో ఓపెన్ చేయొద్దన్నారు. ఎవరైనా సైబర్ నేరస్తుల బారిన పడితే తక్షణమే పోలీస్‌శాఖను సంప్రదించాలన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ నెట్వర్క్ అధికారి బాల్‌రాజ్, బీఎస్‌ఎన్‌ఎల్‌లోని విజిలెన్స్ విభాగం అధికారి ఉమా మహేశ్వరి, సామాజిక శాస్త్ర విభాగాధిపతులు డాక్టర్ జోష్ణ, డాక్టర్ అనురాధ, డాక్టర్ వాణి, డాక్టర్ మల్లిక, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాలలో గురువారం సంగారెడ్డిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా లయన్స్‌క్లబ్ సభ్యులు లాడే మల్లేశం, లయన్స్ క్లబ్ ఆదర్శ ప్రెసిడెంట్ జార్జ్ మ్యాథ్యూ, సెక్రటరీ రామప్ప, ట్రెజర్ కృష్ణ మాట్లాడుతూ.. క్యాన్సర్ వ్యాధి శరీరంలోని కణాల మధ్య అపసవ్య వృత్తి వల్ల వస్తుందని, ఈ వ్యాధి ప్రారంభంలో గుర్తించడం కష్టమన్నారు. ప్రారంభంలో గుర్తిస్తే చికిత్సతో అదుపు చేయవచ్చునని అన్నారు. వ్యాధి లక్షణాలను బట్టి సర్జరీ ద్వారా కణితి తొలగింపు, కిమోథెరపీ వంటి చికిత్సలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ ఎం వెంకటేశం, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ అల్లంరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

జహీరాబాద్: సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు గురువారం క్యాంపు కార్యాలయంలో 9మంది లబ్ధిదారులకు రూ.2.74లక్షల విలువ గల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయనిధి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బండిమోహన్, యాకూబ్, పద్మజ, సత్యం, ముర్తుజ, గణేష్, చంద్రయ్య, లవణ్, సందీప్, ఫహీమ్, పాండు, బిక్కునాయక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

నారాయణఖేడ్: మనూరు మండల కేంద్రానికి చెందిన సుగుణమ్మకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.14,500లు మంజూరు అయ్యాయి. సంబంధించిన చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి బీఆర్‌ఎస్ కార్యాలయంలో అందజేశారు.

స్కాలర్‌షిప్ విడుదల చేయాలని ధర్నా



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న దృశ్యం

జహీరాబాద్ టౌన్: పెండింగ్ స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని బస్టాండ్ వద్ద పలు కళాశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయలు రూ. 7,800 కోట్లు ఉన్నాయన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పేద విద్యార్థులు మధ్యలో చదువులు మానేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉన్నత చదువులకు వెళ్లాల్సిన విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్ నిధులు విడుదల చేయాలని కోరారు. లేనియెడల సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజు, పవన్, అనిల్, తరుణ్, ప్రసాద్ ఉన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



అభివృద్ధి పనులు ప్రారంభించిన రోజా

జిన్నారం(పటాన్‌చెరు) : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు కేబీఆర్ కాలనీ, 11వ వార్డు బీరప్ప బస్తీలో సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను గురువారం మున్సిపల్ చైర్ పర్సన్ కొలన్ రోజా ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ. 50 లక్షల నిధులతో నిర్మించనున్నట్లు చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బీరప్ప యాదవ్, ఏఈ కిష్టయ్య, స్థానికులు ప్రశాంత్, శ్రీనివాస్, రాజు, రవీందర్, అరుణ్, వెంకట్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉచితంగా విత్తనాల పంపిణీ

కేవీకే శాస్త్రవేత్తలు వరప్రసాద్, రమేష్



విత్తనాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: మేలురకం కుసుమ విత్తనాలతో మంచి దిగుబడులను పొందవచ్చని డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్తలు సి.వరప్రసాద్, వి.రమేష్ అన్నారు. గురువారం మొగుడంపల్లి మండలంలోని గౌటిగార్‌పల్లి గ్రామ రైతులకు తెల్లకుసుమ విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. జూన్‌లో కంది విత్తనాలు ఇచ్చిన రైతులకు లింగాకర్షక బుట్టలు, వేప నూనెను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కేవీకే తరఫున ఐఎస్‌ఎఫ్ 764 రకం కుసుమ విత్తనాలను అందించామన్నారు. ఈ రకం 125–130 రోజుల్లో కోతకు వస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

కల్హేర్(నారాయణఖేడ్): మండల కేంద్రంలో గురువారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. దేవాలయాల ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రాంమందిరం నుంచి ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. హిందు సంస్కృతిని కాపాడేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

కాంట్రాక్ట్ కార్మికుల వేతనం పెంచాలి



కార్మికులతో మాట్లాడుతున్న మహిపాల్

జహీరాబాద్ టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ డిమాండ్ చేశారు. గురువారం కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండో పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ. 26 వేలు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా కార్మికులకు డీఏ ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. తక్కువ వేతనంతో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని శుక్రవారం హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయ వద్ద ధర్నా చేపడుతున్నామన్నారు. పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు యశోదమ్మ, సంజీవ్, మోహన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

- యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్



సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న ప్రభాకర్, కిష్టయ్య

జహీరాబాద్ టౌన్: ఎస్‌జీటీ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన సమస్యలను పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల ప్రభాకర్ ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలోని యూపీఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్‌జీటీ ఉపాధ్యాయులు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. పీఆర్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్‌ల మధ్య వేతన వ్యత్యాసం తగ్గించాలన్నారు. పెండింగ్ డీఏను వెంటనే చెల్లించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల కిష్టయ్య, నాయకులు అమృత్, పాండు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్, టౌన్ ఎస్‌జీటీయూ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా శివశంకర్, అధ్యక్షుడిగా విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, ఉపాధ్యక్షుడిగా ఇంద్ర, యూనూస్, కోశాధికారిగా రాజేంద్రప్రసాద్, జిల్లా కౌన్సిలర్‌గా శివకుమార్ ఎన్నికయ్యారు. టౌన్ గౌరవ అధ్యక్షుడిగా నాగరాజు, అధ్యక్షుడిగా షకీల్, ప్రధాన కార్యదర్శిగా సుకుమార్, ఉపాధ్యక్షుడిగా సువర్ణ, వెంకటేశం, కౌన్సిలర్‌గా విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు.

మావిపై అవగాహన తప్పనిసరి

- సీనియర్ గైనకాలజిస్ట్ నాగలక్ష్మి



గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న నాగలక్ష్మి

సంగారెడ్డి: భ్రూణాని మాత కణజాలంతో కలిపే ప్రత్యేక నిర్మాణాన్ని జరాయువు (ప్లాసెంటా) మావి అంటారు. ఇది గర్భాశయ కణజాలం, పిండ బాహ్యత్వచాల కలయిక (ఫ్యూజన్) ద్వారా ఏర్పడుతుందని ప్రముఖ గైనకాలజిస్ట్ నాగలక్ష్మి అన్నారు. గురువారం జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలోని మాతాశిశు కేంద్రంలో మావిపై మెడికల్ కళాశాల విద్యార్థులతో గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పిండాభివృద్ధి సమయంలో మాత గర్భాశయం నుంచి పోషక పదార్థాలను, ఆక్సిజన్‌ను నేరుగా గ్రహించి భ్రూణాని అందచేయడానికి తోడ్పడుతుందన్నారు. ప్రతి గర్భిణీ ఈ సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్, మెడికల్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సుధామాధురి, ఆర్‌ఎంఓలు ఆంజనేయులు, రవికుమార్ ఇతర డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో కమీషన్లు

- ఎమ్మెల్యే సంజీవరెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

కల్హేర్(నారాయణఖేడ్): బీఆర్‌ఎస్ పాలనలో రైస్ మిల్లర్ల వద్ద కమీషన్లు తీసుకుని పనిచేశారని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవరెడ్డి ఆరోపించారు. గురువారం కల్హేర్ మండలం కృష్ణాపూర్, రాపర్తి, నిజాంపేట మండలంలోని బాచేపల్లి, నాగధర్‌లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ధాన్యం తూకంలో అధికంగా తరుగు తీసుకుంటే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని, రైస్‌మిల్లులను మూసివేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్‌కుమార్, తహసీల్దార్ శివశ్రీనివాస్, నాయకులు మల్లోడ్డి తుకారాం, దేవదాస్, ఎం. వీర్‌షెట్టి, ఎర్రరవి పాల్గొన్నారు.

పత్తిసాగుపై అవగాహన అవసరం

- ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు రైతులు

హత్నూర(సంగారెడ్డి): పత్తి సాగులో రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏరువాక కేంద్రం సమన్వయకర్త శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ అన్నారు. గురువారం హత్నూర మండలం రెడ్డి ఖానాపూర్ గ్రామంలో పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం సందర్భంగా వారు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట గురించి రైతులకు వివరించారు. సాధారణ పత్తి సాగు కంటే అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేస్తే మేలైన దిగుబడులు, మొక్కల సంఖ్య పెరుగుతాయన్నారు. వరి పంటలో పురుగుల ఉధృతి గమనించడానికి ఎకరాకు 46 లింగాకర్షణ బుట్టలను ఏర్పాటు చేయాలని ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సరిత రైతులకు సూచించారు. ఉద్యాన పంటలు వాటి యాజమాన్యం పద్ధతులపై రైతులకు మెలకువలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాస్, ఏఈఓలు మహేందర్ ,రమేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పత్తికి గడ్డి మందు పిచికారీ

మునిపల్లి(అందోల్): పత్తితీత పనులు ప్రారంభమవుతున్న సమయంలో పత్తిలో వివిధ రకాల పిచ్చి మొక్కలతో పాటు గడ్డి ఏపుగా పెరిగింది. గురువారం మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి గ్రామాల్లో రైతులు పత్తి పంటలో గడ్డి మందు పిచికారీ చేశారు. గడ్డి తీస్తే తప్పా పత్తి పంట తెంపడానికి రాని పరిస్థితి ఏర్పడింది. వర్షాలు ఎక్కువగా పడడంతో పత్తి పంటలో వివిధ రకాల గడ్డి, గంజాయి అలం పెరిగిపోయింది. దీంతో రైతులు గడ్డి మందు పిచికారీ చేసే పనిలో మునిగిపోయారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట పట్టణం మోమిన్‌పేట రోడ్డు యావాపూర్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి శవం లభ్యమైందని సీఐ మహేశ్‌గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంటాక్ట్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి అన్నారు. గురువారం నిర్వహించిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులందరికీ పర్మినెంట్‌తో పాటు వాటర్ సప్లై, బిల్ కలెక్టర్, ఆఫీసు సిబ్బంది, ఎలక్ట్రీషన్, కార్మికులందరికీ పెరిగిన వేతనం అమలు చేయాలన్నారు. 25 సీడీఎంఏ కార్యాలయాన్ని దిగ్బంధం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసీఫ్‌అలీ కథనం ప్రకారం.. బీదర్‌కు చెందిన గురుకృష్ణ(40), మండలంలోని రుద్రారం గ్రామం గణేష్ గడ్డ దేవస్థానం సమీపంలో ఈనెల 9న గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతనిని చికిత్స కోసం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురుకృష్ణ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పొగాకు రహిత గ్రామాలే లక్ష్యం

సంగారెడ్డి క్రైమ్: జిల్లాలోని ఫసల్‌వాది గ్రామంలో పొగాకు వాడకం వల్ల కలిగే నష్టాలపై పొగాకు జిల్లా నియంత్రణ విభాగం సూపర్‌వైజర్ విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత పొగాకు వాడానికి దూరంగా ఉండాలని సూచించారు. బీడీ, సిగరెట్ జర్ధా, గుట్కాపాన్ మసాలాలు సేవించడం వల్ల రోగాల బారిన పడి చిన్నవయస్సులోనే మృతి చెందుతున్నారని తెలిపారు. కావున కేంద్ర ప్రభుత్వం 60 రోజులు టోబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 2.0 ప్రారంభించిందని చెప్పారు.

ఎర్రరాయి గనులపై దాడులు

న్యాల్‌కల్(జహీరాబాద్):మండలంలోని గణేష్‌పూర్ గ్రామ శివారులో అక్రమంగా కొనసాగుతున్న ఎర్రరాయి తవ్వకాలపై మైనింగ్, టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం దాడులు చేశారు. జిల్లా మైనింగ్, టాస్క్‌పోర్స్ ఏడీ రఘుబాబు, ఆర్‌ఐ సాయిరాం స్థానిక రెవెన్యూ అధికారులు శ్యామ్‌రావుతో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రెండు రాయి కోత యంత్రాలను స్వాధీనం చేసున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా ఎర్రరాయి తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిధులు మంజూరు చేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇలంబరితిను గురువారం స్థానిక కార్పొరేటర్ పుష్ప కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. రామచంద్రాపురం పట్టణంలో ఫంక్షన్ హాల్, థీమ్ పార్కు, మీట్ మార్కెట్, రాయసముద్రం చెరువు , స్మశానవాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. ఆయన సానుకూలంగా స్పందించి విడుతల వారీగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని పలు కాలనీల డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయాలని జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలసి వినతిపత్రం అందజేసినట్లు వివరించారు.

వృథాగా తాగునీరు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ జిల్లాపరిషత్ పాఠశాల ప్రాంగణంలోని మిషన్ భగీరథ ట్యాంక్ నిండి నీరు వృథాగా పోయాయి. తాగునీరు వృథా కాకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు

మునిపల్లి(అందోల్): మండలంలోని మక్త్యాసారం ఆత్మానందాశ్రమంలో శిష్యబృందం మదనానంద సరస్వతీ స్వామి, భగవద్భక్త పరాగ పూజ్య పాద రాజయోగి వెంకటస్వామి గురుమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.భజన కార్యక్రమం నిర్వహించారు.

ఆరుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ కథనం ప్రకారం డ్రంకెన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులను గురువారం కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.2 వేలు జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రేమతత్వంతోనే మోక్షం



మాధవానంద స్వామికి పాదపూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ప్రేమతత్వంతోనే మానవ జన్మకు మోక్షమని రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి అన్నారు. గురువారం ఖేడ్ సత్యనారాయణ స్వామి ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సృష్టిలోని వ్యవస్థకు, వ్యక్తులకు సేవ చేసిన అది భగవంతుడి సేవే అవుతుందన్నారు. ప్రతి ప్రాణికి తమ ధర్మాలు ఆచరించడం ప్రధాన కర్తవ్యమన్నారు. స్వామివారిని మాజీ ఎమ్మెల్యే భూ పాల్ రెడ్డి దర్శించుకొని ఆశీస్సులు పొందారు. అనంతరం ఎమ్మెల్యే సంజీవరెడ్డి గృహంలో ఎమ్మెల్యే సోదరులు చంద్రశేఖర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాతృమూర్తి కమలమ్మతో కలిసి పాద పూజ నిర్వహించి,స్వామీవారి ఆశీస్సులు పొందారు.